TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.12, Himayatnagar, Hyderabad-500029,Telangana State, Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

31.10.2015

హైద్రాబాద్:

## స్థానికులకు ఉద్యోగాలు దక్కేలా జోనల్ వ్యవస్థలో మార్పులు రావాలి

తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో " తెలంగాణ రాష్ట్రం జోనల్ వ్యవస్థ – 371 (డి) పరిణామాలు" అనే అంశంపై 198వ చర్చా కార్యక్రమం జరిగింది.

టీఎన్జీవో గౌరవాధ్యక్షులు జి.దేవీప్రసాద్, టీఎన్జీవో అధ్యక్షుడు కారెం రవీందర్ రెడ్డి, ఇంటర్ విద్య జాక్ చైర్మన్ డాక్టర్ పి.మధుసూదన్ రెడ్డి, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సయీద్ సలీముద్దీన్, రిటైర్డ్ ప్రొఫెసర్, తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీధర స్వామి తదితరులు వక్తలుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా టీఎన్జీవో గౌరవాధ్యక్షులు జి.దేవీప్రసాద్ మాట్లాడుతూ, స్థానికులకు ఉద్యోగాలు దక్కేలా జోనల్ వ్యవస్థలో మార్పులు రావాలని అన్నారు. కొత్తగా ఏర్పాటు కాబోయే జిల్లాలు, ఉద్యోగాల హేతుబద్ధీకరణ, స్థానికత, వివిధ జిల్లాల మధ్య ఉన్న అసమానతలు, లభిస్తున్న విద్యా ఉద్యోగావకాశాలు తదితరాలను దృష్టిలో ఉంచుకొని జోనల్ వ్యవస్థలో మార్పుచేర్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

సమావేశానికి హాజరైన ఇతర వక్తలు మాట్లాడుతూ...... "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్య, ఉద్యోగ రంగాల్లో అందరికీ సమానావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో 371 (డి) రూపొందించారు. 32వ రాజ్యాంగ సవరణ ద్వారా 1974లో దీన్ని అమల్లోకి తీసుకువచ్చారు. దీంట్లో మొత్తం 10 క్లాజులున్నాయి. విద్య, ఉద్యోగావకాశాల గురించి 1వ క్లాజ్‌లో నిర్వచించారు. దీని ఆధారంగానే రాష్ట్రపతి ఉత్తర్వులు వచ్చాయి. 1974లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన 674 జి.ఒ. ప్రకారం, రాష్ట్రాన్ని ఆరు జోన్లుగా విభజించారు. తెలంగాణ 5,6 జోన్ల కింద ఉంది. 5వ జోన్‌లో నాలుగు, 6వ జోన్‌లో ఆరు జిల్లాలు ఉన్నాయి. ఈ విధంగా విద్య, ఉద్యోగావకాశాల్లో 'స్థానికత' భావన తీసుకువచ్చారు. నిజానికి తెలంగాణలో ముల్కీ నిబంధనలు అమలు కావాలి. 1919లో వచ్చిన ముల్కీ నిబంధనలు హైదరాబాద్ స్టేట్‌లో, ఆ తరువాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ కొంతకాలం పాటు కొనసాగాయి. ఆర్టికల్ 35 (బి) కూడా ముల్కీ నిబంధనలను సమర్థించింది. ఆ తరువాతి పరిణామాల నేపథ్యంలో ముల్కీ నిబంధనలు రద్దయ్యాయి. ముల్కీ నిబంధనల ప్రకారం ఇతర నిబంధనలకు తోడుగా కనీసం 15 ఏళ్ళ పాటు తెలంగాణలో నివసించిన వారికే స్థానికత లభిస్తుంది. ఈ కాలపరిమితిని ఆ తరువాత 7 ఏళ్ళకు, మరికొంత కాలం తరువాత 4 ఏళ్ళ విద్యాభ్యాసానికి కుదించారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారికి తెలంగాణలో 'స్థానికత' లభించేందుకే ఇలా చేశారు. దీంతో తెలంగాణ వారికి విద్య,

"CHANDRAM" 490, St.No.12, Himayatnagar, Hyderabad-500029,Telangana State, Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

ఉద్యోగావకాశాలు దూరమయ్యాయి. ఈ రోజున కూడా ఓపెన్ కేటగిరిలో ఇతర రాష్ట్రాల వారు అర్హులవుతున్నారు. గతంలో ప్రభుత్వ ఉద్యోగాలు జిల్లా, జోనల్, మల్టీ జోన్, రాష్ట్రస్థాయి అంటూ నాలుగు రకాలుగా ఉన్నాయి. జిల్లాస్థాయిలో ఎల్‌డీసీ, అంతకన్నా దిగువ స్థాయి ఉద్యోగ నియామకాలు చేపట్టేవారు. వీటిలో 80 శాతం స్థానికులకు కేటాయించారు. జోనల్ స్థాయిలో 70 శాతం స్థానికులకు కేటా యించారు. యూడీసీ, దానికంటే తక్కువ, కొన్ని నిర్దిష్ట గెజిటెడ్ ఉద్యోగాలు ఈ స్థాయిలో ఉండేవి. అసిస్టెంట్ డైరెక్టర్, ఆ పై స్థాయి ఉద్యోగాలను రాష్ట్రస్థాయిలో భర్తీ చేసేవారు. ఇంత పక్కాగా నిబంధనలు రూపొందించుకున్నా తెలంగాణ వారికి అన్నింటా అన్యాయమే జరిగింది..." అని అన్నారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన నేపథ్యంలో జోనలైజేషన్ అవసరమా, కాదా అనేది చర్చనీయాంశంగా మారింది. స్థానిక అభ్యర్థులు ఆయా ఉద్యోగాలకు ఎంపిక అయ్యేందుకు జోనల్ వ్యవస్థ ఉండాలని వక్తలు పేర్కొన్నారు. అదే సమయంలో జోన్ల సంఖ్యను పెంచి వాటిని హేతుబద్ధీకరణ చేయాలని అభిప్రాయపడ్డారు. వివిధ పోస్టులను కూడా రేషనలైజేషన్ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కార్యక్రమానికి కారెం రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. విశ్రాంత అధ్యాపకులు, తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చందా రాములు సమన్వయకర్తగా వ్యవహరించారు.

టీఆర్‌సి చైర్మన్ యం.వేదకుమార్, డా॥జి.త్రిపాఠి, జె.శ్రీనివాస్‌రెడ్డి, ఎన్.ఆదినారయణరెడ్డి, ఎం.నరేంద్రకుమార్, డి.కరుణాకర్, ఎస్.లక్ష్మణరావు, బి.వేణుమాధవ్, జి.రాజేంద్రకుమార్, గోలి రవీందర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ ఉద్యోగసంఘాల నాయకులు, ప్రతినిధులు, తెలంగాణవాదులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

**నీరజ**

**టిఆర్‌సి**